

# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

# సరిత

## 1985 అక్టోబర్ – విజయచిత్ర నుంచీ పునర్ముద్రితం




'ప్రముఖ సంగీత దర్శకులు తాతినేని చలపతిరావుగారు మాకు దూరపుబంధువులు. ఓ రోజు ఇంటిలో వుండగా ప్రముఖ మాటల రచయిత గణేష్‌పాత్రోగారు అక్కడకు రావడం జరిగింది.

"'మరో చరిత్ర' చిత్రంలో కమలహాసన్ సరసన నాయికగా నటించేందుకు ఓ పదిహేనేళ్ళ అమ్మాయి కావాలని అన్వేషిస్తున్నారు కె.బాలచందర్. పేపర్లో కూడా అడ్వర్‌టైజ్ చేసారు. ఎందరో అమ్మాయిలు వచ్చారుకానీ ఏ ఒక్కరూ బాలచందర్‌గారికి నచ్చలేదు. నీకేమైనా 'ఇంట్రెస్ట్' వుంటే ఈ రోజు సాయంకాలమే నాలుగున్నర గంటలకి బాలచందర్‌గారిని కలుసుకో" అని చెప్పి వెళ్ళిపోయారు పాత్రో.

సినిమాల్లో నటించాలన్న ఉత్సాహం వుంది. కానీ అది పైకి

చెప్పడానికి వీలులేని పరిస్థితి. ఎందుకంటే నాకు నటన గురించి ఏమీ తెలియదు. అదీగాక నేను అప్పట్లో తొమ్మిదో తరగతి చదువుతూ వుండేదాన్ని కూడా.

కె.బాలచందర్ ఎలా వుంటారు? ఆయన నన్ను తన చిత్రంలో నటించడానికి సెలెక్ట్ చేసుకుంటారా? అని ఆలోచిస్తూనే ఏ మాత్రం 'ఇంట్రెస్ట్' లేకుండానే వెళ్ళాను.

'నీ పేరేమిటి?' అని అడిగారు బాలచందర్, మొట్టమొదటిసారిగా నేను ఆయన ఆఫీసు గదిలో అడుగుపెట్టగానే.

'అభిలాష' అని ఠక్కున సమాధానం చెప్పి, స్కూల్లో అడ్మిషన్ కోసం నిలబడే విద్యార్థిలా నిలుచున్నాను.

పాత్రోగారికి చెప్పి ఓ పేజీ డైలాగ్ రాయించి ఇచ్చి 'పది నిముషాల్లో చెప్ప'మన్నారు నన్ను.

'అయిదు నిముషాలు చాలు' అని చెప్పి, నా ధోరణిలో నాకు తెలిసిన 'మాడ్యులేషన్'లో డైలాగ్ చెప్పాను. తర్వాత ఒక పాట పాడమన్నారు బాలచందర్.

వెంటనే 'రంభ-ఊర్వశి-మేనక' చిత్రంలో రోజారమణి ఎలా డాన్సు చేసిందో అలాగే డాన్సు చేస్తూ పాడుతూ నేలమీదబడి దొర్లడం ప్రారంభించాను. అది చూసిన బాలచందర్‌గారు 'ఇదేమిటి?' అని అడిగారు ఆశ్చర్యంగా.

'ఆ సినిమాలో రోజారమణి తన హీరోతో ఓ గార్డెన్లో ఇలాగే పాడుతూ దొర్లుతూ ఆడుతుంది' అని సమాధానమిచ్చాను.

కొన్ని క్షణాల తర్వాత 'రేపే నీకు మేకప్ టెస్ట్' అన్నారు డైరెక్టర్ కె.బి.

'మేకప్ టెస్ట్' అయిన తర్వాత నా

మేకప్ స్టిల్స్ 'చూసుకుని నన్ను నేనే నమ్మలేకపోయానంటే నమ్మండి' ఆ తర్వాత ఓ పదిహేను రోజులపాటు 'స్విమ్మింగ్' నేర్చుకొమ్మన్నారు డైరెక్టర్. సరేనని చెప్పి సవేరా హోటల్లో వున్న 'స్విమ్మింగ్ పూల్'లో ఈత కూడా నేర్చుకున్నాను. కానీ 'స్విమ్మింగ్‌కి సంబంధించిన సన్నివేశాలు మాత్రం సినిమాలో చిత్రీకరించలేదనుకోండి' అన్నారు సరిత నవ్వుతూ తన సినీరంగ ప్రవేశం గురించి చెబుతూ.

'మొట్టమొదటిసారిగా తెరకు పరిచయమౌతూ, కమల్‌హాసన్‌తో నటించేటప్పుడు మీరెలా ఫీలయ్యారు?' అని అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా 'కమల్‌తో నటించే అవకాశం రావడం 'గొప్ప థ్రిల్లింగ్'గా అనిపించింది. చాలా ఆనందంగా 'ఫీల'య్యాను.

నేను ఆ చిత్రంలో నటించిన మొట్టమొదటి సన్నివేశం విశాఖపట్నంలో చిత్రీకరించారు. నన్ను మా వూరికి తిప్పి పంపేసేటంతగా విసిగించేసాను డైరెక్టర్‌గార్ని.

ఓ సందర్భంలో నేను కమల్ చేయి పట్టుకుని 'ఏమిటి? తప్పా?' అని అడగాలి.

ఆ సన్నివేశంలో నా రియాక్షన్ ఎలా వుండాలో క్షుణ్ణంగా వివరించి చెప్పారు దర్శకులు బాలచందర్‌గారు. కానీ నావల్లనైతేగా.. అలాగే కష్టపడి. ఆయనచేత తెగతిట్లు తిని చివరకు నటించేసాను. రెండు మూడు రోజులైన తర్వాత నాకు అలవాటైపోయింది.

ఆ తర్వాత ఆయన 'ఈ సీన్లో నువ్వు బాగా చేస్తే ఓ చాక్లెట్ ఇస్తాను' అని అంటూ ఎంతగానో ప్రోత్సహించేవారు. ఆ యూనిట్లో అందరూ ఇప్పటికి కూడా నన్ను ఓ పసిపిల్లని చూసినట్టు చూస్తారు.

నేను మొట్టమొదటిసారిగా కెమెరా ముందు నిలుచున్న రోజు 1977వ సంవత్సరం అక్టోబర్ 19వ తేదీ విజయదశమి. నా జీవితంలో మరుపురాని రోజు. అన్నారు గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ.

'మరో చరిత్ర' మొదలుకుని కె.బాలచందర్ దర్శకత్వంలో ఇంతవరకూ మీరు ఎన్ని చిత్రాలలో నటించారు? అని అడిగినదానికి 'మరో చరిత్ర తర్వాత తమిళ, కన్నడ భాషల్లో తప్పుతాలంగళ్, నూల్ వేలి (తమిళం – తెలుగు), ఎంగవూర్ కన్నగి (తమిళం – తెలూగు): ఆడవాళ్ళూ మీకు జోహార్లు, ఇది కథకాదు, 47రోజులు (తెలుగు –తమిళం): తన్నీర్ – తన్నీర్ (తమిలం): కోకిలమ్మ (తెలుగు): అగ్నిసాక్షి, అచ్చమిల్లై అచ్చమిల్లై (తమిళం) ఎరడు రేగళు (కనండం), ముగిల మల్లిగె (కన్నడం) కల్యాణ అగదిగళ్ (తమిళం) అనే పందొమ్మిది చిత్రాలలో నటించాను' అని సమాధానమిచ్చారు.

'దర్శకులు బాలచందర్ మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుని, మీకు సరిపోయే విధంగా పాత్రను మలచి కథలను తయారు చేస్తారని చాలామంది అనుకుంటున్నారు దానిపై మీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగిన దానికి 'కథలోని పాత్రలకు తగిన పాత్రధారులను ఎన్నుకోవడం, అటువంటివారు దొరకని పక్షంలో వారి కోసం అన్వేషించడం ఆయన అలవాటు. అంతేగాని తారలను దృష్టిలో పెట్టుకుని వారికి తగ్గట్టుగా కథ తయారు చెయ్యడం అన్నది ఆయన స్వభావానికే విరుద్ధం –' అని స్పష్టం చేసారు సరిత.

'మీరు నటించాలనుకున్న పాత్ర, మీకు లభించని సంఘటన ఏదైనా మీ సినీజీవితంలో ఎదురైందా?' అన్న ప్రశ్నకు

'ఉంది. 'అంతులేని కథ' కన్నడంలో తీస్తున్నప్పుడు నన్ను నటించమన్నారు. ఆ చిత్రంలో నేను నటించాలన్న ఆశ ఎంతగా వున్నా కాల్షీట్ల ప్రాబ్లం వలన కుదరలేదు. అయితే అదే చిత్రంలో ఆ పాత్ర పోషించిన సుహాసినికి డబ్బింగ్ చెప్పాను. నేను ఆ సినిమాకి డబ్బింగ్ చెప్పే నాటికి నేనూ కన్నడ రంగానికి కొత్తే.

తెరమీద బొమ్మను చూస్తూ డబ్బింగ్ చెప్పేటప్పుడు నేనే ఆ పాత్రను పోషిస్తున్నట్టుగా ఫీలయ్యాను. నా కోరిక ప్రకారం నేను నటించకుండా 'మిస్' అయిన చిత్రం అదొక్కటే. అయినా ఆ పాత్రకు నేను డబ్బింగ్ చెప్పడం మూలాన ఆ వెలితి నేనెప్పుడూ ఫీలవ్వలేదు.పైగా ఆ చిత్రంలో నేను నటించినట్టు గొప్ప థ్రిల్ పొందాను.

'భవిష్యత్తు గురించి మీ ఆలోచన ఏమిటి?' అనడిగిన చివరి ప్రశ్నకు సమాధానంగా 'త్వరలోనే నూరు చిత్రాలు పూర్తి చేయబోతున్నాను. ఒకవేళ నేను పెళ్ళి చేసుకున్నా ఆ తర్వాత కూడా నటిస్తాను. ఎందుకంటే రెండువందల యాభై చిత్రాలలో నేను నటించాలన్నదే నా ఆశయం –' అని తన స్థిర నిర్ణయాన్ని స్పష్టంగా తెలియజేసారు సరిత.

★★★

COMMENTS